# ప్రజా పాలనే లక్ష్యం

- తెలంగాణ రైజింగ్-2047 విజన్‌తో ముందుకు సాగుతున్నాం..
- జిల్లాలో 9,326 మందికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు
- ఖమ్మంలో రాష్ట్ర అవతరణ వేడుకలలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క



జాతీయ పతాకాన్ని ఎగురవేసి గౌరవ వందనం స్వీకరిస్తున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

ఖమ్మం, జూన్ 2 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : ప్రజా పాలనే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకుపోతున్నదని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ఖమ్మం నగరంలో సోమవారం నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలలో భట్టి విక్రమార్క ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. తొలుత అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పించి పోలీస్ పరేడ్ గ్రౌండ్స్‌లో పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం జాతీయ పతాకావిష్కరణ చేసి ప్రసంగించారు. రాష్ట్రాన్ని ప్రపంచ స్థాయిలో అగ్రస్థానంలో నిలిపేందుకు తెలంగాణ రైజింగ్-2047 విజన్‌తో ప్రజా ప్రభుత్వం ముందుకు సాగుతుందన్నారు. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా నిరుద్యోగ యువతకు 55 వేలకుపైగా ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించామన్నారు. 2030 నాటికి 20 వేల మెగావాట్ల సామర్థ్యం కలిగిన పునరుత్పాదక ఇంధన వనరుల ఆధారిత విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్లు ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలో మహాలక్ష్మి పథకం ద్వారా ఆర్టీసీ బస్సులలో ప్రయాణం చేసిన మహిళలకు రూ.167.89 కోట్లు ఆదా అయ్యాయన్నారు. గ్యాస్ సిలిండర్ సబ్సిడీ 2,42,146 కుటుంబాలు పొందుతున్నాయని, దీని ద్వారా లబ్ధిదారుల ఖాతాల్లో రూ.26.30 కోట్ల సొమ్మును జమ చేశామన్నారు. 200 యూనిట్ల ఉచిత విద్యుత్ వినియోగిస్తున్న వారికి జిల్లాలో రూ.130.18 కోట్ల సబ్సిడీ చెల్లించి 2,43,647 కుటుంబాలకు లబ్ధి చేకూర్చామన్నారు. ఇందిరమ్మ ఇండ్ల పథకంలో జిల్లాలో 9,326 మందికి ఇండ్లు మంజూరు చేశామన్నారు. ఇందిరా మహిళా శక్తి కార్యక్రమంలో మహిళా మార్ట్, క్యాంటిన్లు, 64 స్త్రీ క్యాంటిన్లు ఏర్పాటు చేశామన్నారు. రూ.379.34 లక్షలతో 613 క్యాటిల్ షెడ్లు, రూ.57.13 లక్షలతో 28 ఫౌల్ట్రీ షెడ్లు పూర్తి చేశామన్నారు. అనంతరం రాష్ట్ర సాధన కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరుల కుటుంబ సభ్యులను సన్మానించారు. దేశభక్తి గేయాలపై చిన్నారులు చేసిన ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. వివిధ శాఖల ద్వారా ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను తెలుపుతూ ఏర్పాటు చేసిన స్టాళ్లు, శకటాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, సీపీ సునీల్ దత్, వైరా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్, డీసీసీబీ చైర్మన్ వెంకటేశ్వరరావు, మేయర్ నీరజ, నగర పాలక సంస్థ కమిషనర్ అభిషేక్ అగస్త్య, అదనపు కలెక్టర్లు డాక్టర్ పి.శ్రీజ, శ్రీనివాసరెడ్డి, డీఎఫ్‌వో సిద్ధార్థ విక్రమ్‌సింగ్, డిప్యూటీ మేయర్ ఫాతిమా జోహారా, జడ్పీ సీఈవో దీక్షా రైనా, డీఆర్వో పద్మశ్రీ, డీఆర్‌డీవో సన్యాసయ్య, ఆర్డీవో నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

# సీతారామతో రైతులకు మేలు

- కొత్తగూడెంలో విమానాశ్రయానికి కృషి
- త్వరలో ఎర్త్ యూనివర్సిటీ ఏర్పాటు
- రాష్ట్ర అవతరణ వేడుకల్లో మంత్రి తుమ్మల
- పాల్గొన్న కలెక్టర్ జితేష్, ఎస్పీ రోహిత్‌రాజు, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని



జాతీయ పతాకాన్ని ఎగురవేసి గౌరవ వందనం చేస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

భద్రాద్రి కొత్తగూడెం, జూన్ 2 (నమస్తే తెలంగాణ): సీతారామ ఎత్తిపోతల పథకం ప్రధాన కాలువ పనులను పూర్తిచేసి మూడు పంప్‌హౌస్‌లను ప్రారంభించామని, సీతారామ నీటి విడుదలతో రైతులకు ఎంతో మేలు జరుగుతున్నదని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. సోమవారం తెలంగాణ రాష్ట్ర అవతరణ దిన వేడుకల్లో భాగంగా జిల్లా కేంద్రంలోని కొత్తగూడెం ప్రగతి మైదానంలో స్థానిక ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, కలెక్టర్, ఎస్పీ రోహిత్‌రాజులతో కలిసి అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పించారు. అనంతరం జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల జిల్లా ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ సీతారామ ప్రాజెక్టు ద్వారా జిల్లాలో 1,57,574 ఎకరాల కొత్త ఆయకట్టు, చిన్నతరహా చెరువుల కింద 42,953 ఎకరాల స్థిరీకరించడం ప్రతిపాదించబడిందని, సీతమ్మ సాగర్ బహుళార్థక సాధక ప్రాజెక్టు కోసం 3,123 ఎకరాలు భూ సేకరణ పూర్తి అయిందని చెప్పారు. మధ్యతరహా సాగునీటి ప్రాజెక్టులైన పెద్దవాగు, తాలిపేరు, కిన్నెరసాని ద్వారా 37,060 ఎకరాలకు, చిన్నతరహా నీటిపారుదల వనరుల ఆయకట్టు కింద 1,29,058 ఎకరాలకు నీటి పారుదల జరుగుతుందని తెలిపారు. భూ భారతి రెవెన్యూ గ్రామసభల్లో దరఖాస్తులను అందజేయాలని పేర్కొన్నారు. జిల్లాను అన్నిరంగాల్లో మొదటిస్థానంలో నిలపడంలో ప్రజలు, ఉద్యోగులు, ప్రతి ఒక్కరూ పని చేయాలని విజ్ఞప్తి చేశారు. తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలు ప్రతిబింబించేలా ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు చూపరులను ఆకట్టుకున్నాయి. రవాణా, రాష్ట్ర రోడ్డు, రవాణా సంస్థ, పశుసంవర్ధక, అగ్నిమాపక, వైద్య శాఖలు చేపడుతున్న పలు కార్యక్రమాలపై ఏర్పాటు చేసిన శకటాలు ప్రదర్శించారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్న విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ వేడుకల్లో అదనపు కలెక్టర్లు వేణుగోపాల్, విద్యాచందన, కొత్తగూడెం ఆర్డీవో మధు, తహసీల్దార్ పుల్లయ్య, అన్ని శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ఇండ్ల కోసం మోకాళ్లపై కూర్చొని నిరసన

**ఎంపికలో అన్యాయం జరిగిందని నిరుపేదల ఆరోపణ**

**ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసేవరకూ పోరాడుతామని హెచ్చరిక**



పేరుపల్లి గ్రామంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద మోకాళ్లపై కూర్చొని నిరసన వ్యక్తం చేస్తున్న నిరుపేదలు, దరఖాస్తుదారులు

కారేపల్లి, జూన్ 2 : అర్హులను పక్కనపెట్టి పక్కా భవనాలు, వ్యవసాయ భూములు, ఆస్తులు ఉన్న వారికి ఇండ్ల జాబితాలో చోటు కల్పించడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ కారేపల్లి మండలం పేరుపల్లి పంచాయతీకి చెందిన నిరుపేదలు, దరఖాస్తుదారులు డాక్టర్ బీఆర్.అంబేద్కర్ విగ్రహం ఎదుట మోకాళ్లపై కూర్చొని సోమవారం నిరసన వ్యక్తం చేశారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు నిరుపేదలు, దరఖాస్తుదారులు మాట్లాడుతూ పేరుపల్లి పంచాయతీ పరిధిలో అధికార పార్టీకి అనుకూలంగా ఉన్న, సంపన్న కుటుంబాలకు ఇందిరమ్మ కమిటీలు ఇండ్ల జాబితాలో చోటు కల్పించి రహస్యంగా ఉంచుతున్నారని ఆరోపించారు. ఉన్నతాధికారులు జాబితాను పరిశీలించి నిరుపేదలు, పూరి గుడిసెలు, రేకుల షెడ్లలో నివాసం ఉంటున్న వారికి ఇండ్లు మంజూరయ్యేలా చూడాలని కోరారు. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా ఇండ్లు మంజూరు చేయని పక్షంలో మండల పరిషత్ కార్యాలయం ఎదుట ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఇందిరమ్మ కమిటీ సభ్యుడు పప్పుల వెంకటేశ్వర్లు, అంబేద్కర్ సేన జిల్లా కో కన్వీనర్ పప్పుల నిర్మల, దరఖాస్తుదారులు, నిరుపేదలు అజ్మీరా సరిత, శంకర్, దారా బక్కయ్య, అజ్మీరా నగేష్, దారా రాంబాబు, పాయం భిక్షపతి, రవి, గుగులోత్ సుభద్ర, కోటం నాగమణి, అజ్మీరా లక్ష్మి, విక్రమ్, గడ్డి రేణుక తదితరులు పాల్గొన్నారు.

# సుదీర్ఘ పోరాటంతోనే.. స్వరాష్ట్ర సాకారం



కొత్తగూడెంలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో జాతీయ జెండాను ఎగురవేస్తున్న పార్టీ భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు, చిత్రంలో మాజీ ఎమ్మెల్యేలు వనమా వెంకటేశ్వరరావు, మెచ్చా నాగేశ్వరరావు, హరిప్రియ, ఉద్యమనేత దిండిగాల రాజేందర్, బీఆర్ఎస్ నాయకులు

- పరాయి సంకెళ్లు తెంచి స్వేచ్ఛావాయువులనిచ్చిన తెలంగాణ స్వాప్నికుడు కేసీఆర్
- సబ్బండ వర్గాల అండతో ఢిల్లీ మెడలు వంచడం వల్లనే స్వరాష్ట్రం సిద్ధించింది
- ఉద్యమసారథి పాలనా దక్షతతోనే తెలంగాణ రాష్ట్రం బంగారుమయమైంది
- అమరవీరుల త్యాగాలకు ప్రతిరూపంగా 'తెలంగాణం' దేశానికి ఆదర్శమైంది
- ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ వేడుకల్లో వక్తలు
- బీఆర్ఎస్ సహా వివిధ పార్టీలు, ఉద్యోగ సంఘాల ఆధ్వర్యంలో వేడుకలు
- తెలంగాణ తల్లి విగ్రహాలకు పూలమాలలు, అమరుల స్తూపాలకు నివాళులు
- బీఆర్ఎస్ ఆఫీసులు, ప్రభుత్వ కార్యాలయాల్లో జాతీయ పతాకాల ఆవిష్కరణలు



ఖమ్మం బీఆర్ఎస్ ఆఫీసులో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య



కూసుమంచి (నేలకొండపల్లి): జెండా ఎగుర వేస్తున్న మాజీ ఎమ్మెల్యే కందాళ

సబ్బండ వర్గాల అండతో ఉద్యమసారథి కేసీఆర్ సుదీర్ఘకాలం చేసిన పోరాటం వల్లనే నాలుగున్నర కోట్ల తెలంగాణ ప్రజల స్వరాష్ట్ర స్వప్నం సాకారమైందని వక్తలు పేర్కొన్నారు. 'కేసీఆర్ సచ్చుడో.. తెలంగాణ వచ్చుడో..' అనే నినాదంతో తెలంగాణ జనుల మద్దతుతో ఢిల్లీ పెద్దల మెడలు వంచిన కేసీఆర్.. స్వరాష్ట్ర కలను నిజం చేశారని గుర్తుచేశారు. తద్వారా వలస పాలకుల నుంచి విముక్తి కల్పించి సమస్త తెలంగాణ ప్రజలకు స్వేచ్ఛావాయువులను ప్రసాదించారని జ్ఞప్తికి తెచ్చారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఉమ్మడి ఖమ్మం జిల్లాలో బీఆర్ఎస్ సహా వివిధ పార్టీలు, ఉద్యోగ సంఘాలు, ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో సోమవారం వేడుకలు ఘనంగా జరిగాయి. బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఖమ్మం, భద్రాద్రి జిల్లా కేంద్రాల్లోని ఆ పార్టీ జిల్లా కార్యాలయాలైన తెలంగాణ భవన్‌లలో తెలంగాణ తల్లి, ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటాలకు పూలమాలలు వేశారు. జాతీయ జెండాలను ఆవిష్కరించారు.

## పోరుబాట నుంచి.. ప్రగతిబాట వైపు..

ఖమ్మంలోని తెలంగాణ భవన్‌లో మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య, టీఎస్ సీడ్స్ మాజీ చైర్మన్ కొండబాల కోటేశ్వరరావు, ఆర్‌జేసీ కృష్ణ, మధిరలో జడ్పీ మాజీ చైర్మన్ లింగాల కమల్‌రాజు, ఖమ్మం రూరల్లో పాలేరు మాజీ ఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డి, మణుగూరు, కొత్తగూడెంలో బీఆర్ఎస్ భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు, కొత్తగూడెం మాజీ ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు, ఇల్లెందులో మాజీ ఎమ్మెల్యే హరిప్రియ, ఉద్యమనేత దిండిగాల రాజేందర్, దమ్మపేటలో మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు, భద్రాచలంలో ఉద్యమ నాయకుడు మానే రామకృష్ణ, నియోజకవర్గ నాయకుడు రావులపల్లి రాంప్రసాద్ తదితరుల సారథ్యంలో ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఉద్యమసారథి కేసీఆర్ సుదీర్ఘకాలంపాటు చేసిన పోరాటంతోనే స్వరాష్ట్ర స్వప్నం సాకారమైందని గుర్తుచేశారు. స్వరాష్ట్ర స్వాప్నికుడి పాలనా దక్షతతోనే తెలంగాణ రాష్ట్రం ప్రగతిబాటల వైపు పయనించిందని జ్ఞప్తికి తెచ్చారు.

## ఘనంగా వేడుకలు..

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా తెలంగాణ ఆవిర్భావ వేడుకలు ఘనంగా జరిగాయి. ఖమ్మంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, కొత్తగూడెంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, సింగరేణిలో సీఎండీ బలరాం, భద్రాచలం ఐటీడీఏలో పీవో రాహుల్, భద్రాద్రి కలెక్టరేట్‌లో కలెక్టర్ జితేశ్, ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ రోహిత్‌రాజు, ఖమ్మం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ శ్రీజ, ఖమ్మం జడ్పీలో సీఈవో దీక్షారైనా తదితరులు జాతీయ పతాకాలను ఆవిష్కరించారు. బీఆర్ఎస్ ఆధ్వర్యంలో తెలంగాణ తల్లి, ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహాలకు, అమరవీరుల స్తూపాలకు పూలమాలలు వేసి అంజలి ఘటించారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లోనూ ఆయా శాఖల అధికారులు తెలంగాణ తల్లి, ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటాలకు నివాళులర్పించారు. మువ్వన్నెల పతాకాలను ఎగురవేశారు.

–నమస్తే నెట్‌వర్క్



జెండాను ఎగురవేస్తున్న జడ్పీ మాజీ చైర్మన్ లింగాల కమల్‌రాజు



ఖమ్మం: సాంస్కృతిక ప్రదర్శనలు చేస్తున్న విద్యార్థులు



కొత్తగూడెం సింగరేణి: పోతరాజుల సన్నివేశంలో విద్యార్థులు

# జాతీయస్థాయిలో సింగరేణికి స్థానం

- బొగ్గు ఉత్పత్తి ఖర్చును తగ్గించాలి
- యంత్రాల పనిగంటలు పెంచాలి
- సంస్థ సీఎండీ బలరాం



జాతీయ పతాకాన్ని ఎగురవేస్తున్న సింగరేణి సీఎండీ బలరాం

కొత్తగూడెం సింగరేణి, జూన్ 2: ఇతర రాష్ట్రాల్లో బొగ్గు బ్లాకులతోపాటు ఇతర ఖనిజ గనులను సాధించుకొని జాతీయస్థాయిలో సింగరేణి సంస్థ ఎదుగుతోందని సంస్థ సీఎండీ బలరాం అన్నారు. సోమవారం తెలంగాణ రాష్ట్ర 11వ అవతరణ దినోత్సవం సందర్భంగా కొత్తగూడెం ప్రకాశం స్టేడియంలో వేడుకలు నిర్వహించారు. ఈ వేడుకల్లో ముఖ్యఅతిథిగా పాల్గొని జాతీయ జెండాను ఎగురవేశారు. అనంతరం తెలంగాణ రన్‌ను ప్రారంభించి అమరవీరులకు నివాళులర్పించారు. స్కౌట్స్ అండ్ గైడ్స్, ఎస్‌అండ్‌పీసీల గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా కార్మికులను ఉద్దేశించి సీఎండీ బలరాం మాట్లాడుతూ 136 సంవత్సరాల చరిత్ర కలిగిన సింగరేణి సంస్థ ఆరు జిల్లాల్లోని 11 ఏరియాల్లో, 39 భూగర్భ గనులు 41 వేల మంది కార్మికులతో ఏడాదికి సుమారు 700లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి చేసి రాష్ట్రంలో ఉన్న అన్ని థర్మల్ విద్యుత్ కేంద్రాలకు బొగ్గును అందిస్తున్నట్లు తెలిపారు. మన రాష్ట్రంతోపాటు ఒడిశా రాష్ట్రంలో కూడా ఏడాదికి మిలియన్ టన్నులు ఉత్పత్తి చేసే గనిని ఈ ఏడాది ప్రారంభించుకోవడం సింగరేణి సంస్థకు చారిత్రాత్మక ఘట్టమన్నారు. దీంతో దేశంలోని ఇతర రాష్ట్రాల్లో కూడా బొగ్గు ఉత్పత్తిలో అడుగుపెట్టి సింగరేణి సంస్థ జాతీయస్థాయిలో స్థానాన్ని దక్కించుకుందన్నారు. ప్రస్తుతం పోటీ మార్కెట్‌లో నిలబడాలంటే కనీసం టన్నుకు వెయ్యి రూపాయల ఉత్పత్తి ఖర్చును తగ్గించుకోవాలన్నారు. పనివేళలను పూర్తిగా మార్చుకోవాలని, షిఫ్టు సమయం 8 గంటలు పూర్తిగా పనిచేయడంతోపాటు మనం వాడే యంత్రాలతో కూడా పని చేయించాలని చెప్పారు. ఈ సందర్భంగా ఉత్తమ ఉద్యోగులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జీఎం వెల్ఫేర్ కిరణ్‌కుమార్ అధ్యక్షత వహించగా డైరెక్టర్లు ఎల్‌వీ సూర్యనారాయణ, వెంకటేశ్వర్లు, గుర్తింపు సంఘం నుంచి రాజ్‌కుమార్, ప్రాతినిధ్య సంఘం నుంచి పీతాంబరరావు, సీఎంవోఏఐ వైస్ ప్రెసిడెంట్ రాజీవ్‌కుమార్, కార్పొరేట్ పరిధిలోని వివిధ శాఖల జీఎంలు, వివిధ శాఖల అధిపతులు, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

# అజయ్ ఇంటికి హరీశ్‌రావు, వద్దిరాజు

**సాదరంగా ఆహ్వానించి సత్కరించిన మాజీ మంత్రి పువ్వాడ**



ఖమ్మం, జూన్ 2: హైదరాబాద్ జూబ్లీ హిల్స్‌లోని మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ స్వగృహానికి మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర సోమవారం వెళ్లారు. అజయ్‌కుమార్ ఇటీవల హైదరాబాద్‌లో నూతన గృహాన్ని నిర్మించుకొని గృహప్రవేశం చేశారు. ఆ వేడుకకు అప్పట్లో హాజరుకాలేకపోయిన హరీశ్‌రావు.. సోమవారం రాజ్యసభ సభ్యుడు వద్దిరాజుతో కలిసి వెళ్లారు. దీంతో వీరిని సాదరంగా ఆహ్వానించిన అజయ్.. శాలువాలతో వారిని సత్కరించి గౌరవించారు.

# హ్యాపీ బర్త్ డే హరీశన్నా..

***ఒడిశా రాష్ట్రం పూరీ తీరంలో సైకత శిల్పం గీసిన అభిమాని***




మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు జన్మదినం సందర్భంగా బీఆర్ఎస్ జిల్లా నాయకుడు, అభిమాని ఉప్పల వెంకటరమణ ముదిరాజ్ ఆయనపై ఉన్న అభిమానాన్ని చాటుకున్నాడు. ఒడిశా రాష్ట్రంలోని పూరీ తీరంలో 'హ్యాపీ బర్త్ డే హరీశన్నా' అంటూ సైకత శిల్పం రూపొందించి శుభాకాంక్షలు తెలియజేస్తూ తన అభిమానాన్ని వ్యకం చేశాడు. –ఖమ్మం, జూన్ 2

# ఇందిరమ్మ ఇల్లు రాలేదని ఆత్మహత్యాయత్నం

**నేలకొండపల్లి మండలం మంగాపురంతండాలో ఘటన**



ఒంటిపై పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ధరావత్ కేశ్యా

కూసుమంచి(నేలకొండపల్లి), జూన్ 2 : నిరుపేదనైన తనకు ఇందిరమ్మ ఇల్లు వస్తుందని ఎంతో ఆశపడినప్పటికీ జాబితాలో పేరు లేకపోవడంతో తీవ్ర మనస్తాపం చెందిన ఓ గిరిజనుడు ఒంటిపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ ఘటన నేలకొండపల్లి మండలం మంగాపురంతండాలో సోమవారం చోటు చేసుకుంది. వివరాలు ఉన్నాయి. తండాకు చెందిన ధరావత్ కేశ్యా కూలి పనులు చేసుకుంటూ భార్య, ముగ్గురు పిల్లలను పోషించుకుంటున్నాడు. రేకుల షెడ్‌లో నివసిస్తున్న అతడు ఇందిరమ్మ ఇంటి కోసం దరఖాస్తు చేసుకొని జాబితాలో పేరు వస్తుందని ఎంతో ఆశగా ఎదురుచూస్తున్నాడు. ఈ క్రమంలో అధికారులు సోమవారం ప్రకటించిన జాబితాలో తన పేరు లేకపోవడంతో తీవ్ర మనస్తాపం చెందిన కేశ్యా.. ఒంటిపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా పక్కనే ఉన్న వారు, అధికారులు కలుగజేసుకొని అతడికి నచ్చజెప్పారు. నిరుపేదనైన తనకు అన్ని అర్హతలున్నా ఇండ్ల జాబితాలో పేరు లేకపోవడం ఏమిటని అధికారులను ప్రశ్నించాడు. ఆస్తులు, బంగ్లాలు ఉన్న వారికే ఇండ్లు మంజూరు చేస్తారా? మాలాంటి నిరుపేదలు మీకు కనిపించరా? అంటూ ఆవేదన వ్యక్తం చేశాడు. తమకున్న రేకుల షెడ్డును చూసి అధికారులు ఇల్లు మంజూరు చేయాలని వేడుకున్నాడు.


